జిట్టా బాలకృష్ణారెడ్డికి నివాళి

జిట్టా బాలకృష్ణారెడ్డి చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న ఆయన అభిమానులు

వలిగొండ, సెప్టెంబర్ 15 : తెలంగాణ మలిదశ ఉద్యమకారుడు జిట్టా బాలకృష్ణారెడ్డి దశ దినకర్మ సందర్భంగా మండలంలోని వేములకొండ గ్రామానికి చెందిన ఆయన అభిమానులు గ్రామంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద జిట్టా చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. కార్యక్రమంలో ఆకుల వెంకన్న, కేశిరెడ్డి జనార్దన్‌రెడ్డి, ఎలగందుల రవీందర్, బత్తుల అంజయ్య, సాయిని నాగేశ్, కాడిగళ్ల దేవేందర్, వల్లమల్ల నర్సింహ, యాదయ్య, ఆంజనేయులు, రమేశ్, దస్తగిరి, గంగయ్య పాల్గొన్నారు.

మహిళలపై లైంగికదాడులను అడ్డుకోవాలి

- విశ్వహిందూ పరిషత్ జాతీయ ప్రధాన కార్యదర్శి బజరంగ్ బంగ్రా

సమావేశంలో మాట్లాడుతున్న వీహెచ్‌పీ జాతీయ ప్రధాన కార్యదర్శి బజరంగ్ బంగ్రా

యాదగిరిగుట్ట, సెప్టెంబర్ 15 : మహిళలపై జరిగే లైంగికదాడులను అడ్డుకోవాలని విశ్వహిందూ పరిషత్ జాతీయ ప్రధాన కార్యదర్శి బజరంగ్ బంగ్రా పిలుపునిచ్చారు. యాదగిరిగుట్టలోని రెడ్డి సత్రంలో జరిగిన అఖిల భారత విశ్వ హిందూ పరిషత్ విశేష సంపర్క జాతీయ సమావేశాల్లో ఆదివారం ఆయన ముఖ్య వక్తగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జైనూర్‌లో గిరిజన మహిళపై జరిగిన పాశవిక చర్యను తీవ్రంగా ఖండించారు. గిరిజన ప్రాంతాల్లో జరుగుతున్న లవ్ జిహాదీలను అడ్డుకునే బాధ్యత వీహెచ్‌పీ కార్యకర్తలపై ఉందన్నారు. హిందువులపై జరుగుతున్న దాడులను ప్రతి ఒక్కరూ వ్యతిరేకించాలని కోరారు. సమావేశంలో విశ్వహిందూ పరిషత్ జాతీయ ప్రతినిధులు అంబరీశ్ సింగ్‌జీ, సంజయ్ ఆవశేకర్ జీ, తెలంగాణ విశేష సంపర్క ప్రముఖ్ డాక్టర్ వెంటేశ్వర్ రాజు, తోట భానుప్రకాశ్, గూడూరు మహేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

తెలంగాణ పోరాట వీరులను మరువద్దు : సీపీఐ

సాయిరెడ్డి స్తూపం వద్ద నివాళి అర్పిస్తున్న సీపీఐ జిల్లా కార్యదర్శులు శ్రీరాములు, సత్యం

చౌటుప్పల్ రూరల్, సెప్టెంబర్ 15 : తెలంగాణ పోరాట వీరులను మరువద్దని సీపీఐ యాదాద్రి, నల్లగొండ జిల్లాల కార్యదర్శులు గోద శ్రీరాములు, నెల్లికంటి సత్యం అన్నారు. మండలంలోని మసీదుగూడెంలో పార్టీ ఆధ్వర్యంలో ఆదివారం తెలంగాణ పోరాట వారోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా తెలంగాణ తొలిదశ పోరాటవీరుడు వాకిటి సాయిరెడ్డి స్తూపానికి నివాళులర్పించారు. కార్యక్రమంలో బచ్చనగోని గాలయ్య, కె.శ్రీనివాస్, పల్లె శేఖర్‌రెడ్డి, దుబ్బాక భాస్కర్, సంజీవ పాల్గొన్నారు.

'సాయుధ పోరాట చరిత్రను పాఠ్యపుస్తకాల్లో చేర్చాలి'

అమరుల స్మారక స్తూపాల వద్ద నివాళి అర్పిస్తున్న సీపీఐ నాయకులు

భువనగిరి కలెక్టరేట్, సెప్టెంబర్ 15 : స్వాతంత్ర్య సమరయోధులు, తెలంగాణ సాయుధ పోరాటయోధుల చరిత్రను పాఠ్యపుస్తకాల్లో ప్రచురించాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు ఏశాల అశోక్ అన్నారు. రైతాంగ సాయుధ పోరాట వార్షికోత్సవాల్లో భాగంగా మండలంలోని బస్వాపురం గ్రామంలో ముదిగొండ జమ్మయ్య, దుర్గపతి గౌరయ్య, వర్రె నర్సయ్య స్మారక స్తూపాలకు ఆదివారం పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బ్రిటీష్ పాలనకు, నిజాం సైన్యానికి వ్యతిరేకంగా ఎంతో మంది పోరాడి కోట్లాది మంది ప్రజల్లో చైతన్యం రగిలించారన్నారు. సాయుధ పోరాటంలో పీడిత ప్రజల కోసం గెరిల్లా పోరాటం చేసిన త్యాగధనుల గురించి, తెలంగాణ రైతాంగా సాయుధ పోరాట వాస్తవిక గాథను నేటి యువతరానికి తెలియజేయాల్సి ఉన్నదని తెలిపారు. తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటం ప్రపంచ చరిత్రలో సువర్ణ అక్షరాలతో లిఖించదగ్గదన్నారు. కార్యక్రమంలో నాయకులు రాఘవులు, భిక్షపతి, పెంటయ్య, ఐలయ్య, నర్సయ్య, వెంకటయ్య, మల్లేశ్, జమ్ములు, చంద్రయ్య, వెంకటేశ్, కరుణాకర్, సిద్ధులు, రాజు, చంద్రశేఖర్, మల్లారెడ్డి పాల్గొన్నారు.

'ఉద్యమకారులకు న్యాయం చేయాలి'

యాత్రలో మాట్లాడుతున్న చీమ శ్రీనివాస్

చౌటుప్పల్, సెప్టెంబర్ 15 : రాష్ట్ర ఉద్యమకారులకు కాంగ్రెస్ ప్రభుత్వం న్యాయం చేయాలని తెలంగాణ ఉద్యమకారుల ఫోరం రాష్ట్ర అధ్యక్షుడు చీమ శ్రీనివాస్ అన్నారు. ఫోరం ఆధ్వర్యంలో చేపట్టిన 33 జిల్లాల చైతన్య యాత్ర ఆదివారం చౌటుప్పల్ మండల కేంద్రానికి చేరుకున్నది. ఈ సందర్భంగా అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రత్యేక రాష్ట్ర పోరులో ఉద్యమకారుల పోరాటాలను వివరించి, వారందరికీ సముచిత స్థానం కల్పించాలని కోరారు. కార్యక్రమంలో పి.జ్యోతిరెడ్డి, సంగిశెట్టి క్రిస్టోఫర్, జోగు అంజయ్య, గట్టు సుధాకర్, పటోళ్ల సురేందర్‌రెడ్డి, జి.భాస్కర్, జానకిరెడ్డి, ఈపూరి శేఖర్, ఎండీ ఖలీల్, చీమకండ్ల శ్రీనివాస్, కొయిగూర బాబు, చీకూరి వెంకటేశం పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

రామన్నపేట, సెప్టెంబర్ 15 : మండలంలోని ఇంద్రపాలనగరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల 2003-04 బ్యాచ్ పదోతరగతి విద్యార్థులు ఆదివారం ఆత్మీయ సమ్మేళనం జరుపుకొన్నారు. ఈ సందర్భంగా చిన్ననాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. అనంతరం విద్యాబుద్ధులు నేర్పిన గురువులను సన్మానించి మెమెంటోలు అందజేశారు. ఉపాధ్యాయులు నర్సింహ, అంజయ్య, గోవర్ధనాచారి, భిక్షపతి, రామ్మూర్తి, కుమారస్వామి, భాస్కరాచారి, హనుమంతు, లక్ష్మణాచారి, గోపాల్‌రెడ్డి, శేఖర్‌రెడ్డి, నరహరి, జలజాక్షి, నర్మద, సంధ్య, శోభ పాల్గొన్నారు.

యాదగిరిగుట్టలో భక్తుల సందడి



క్యూ కాంప్లెక్స్‌లో భక్తుల సందడి

యాదగిరిగుట్ట, సెప్టెంబర్ 15 : యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో ఆదివారం భక్తుల సందడి నెలకొన్నది. వరుస సెలవులు రావడంతో స్వయంభూ పంచనారసింహస్వామిని దర్శించుకునేందుకు భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. తిరుమాఢవీధులు, క్యూ కాంప్లెక్స్ సందడిగా మారాయి. క్యూలైన్లు, ప్రసాద విక్రయశాల, లక్ష్మీ పుష్కరిణి, కల్యాణకట్ట, బస్టాండ్, శివాలయం భక్తులతో కిటకిటలాడాయి. స్వామివారి ధర్మ దర్శనానికి 2 గంటలు, వీవీఐపీ దర్శనానికి గంట సమయం పట్టిందని భక్తులు వెల్లడించారు. తెల్లవారుజామునే ఆలయాన్ని తెరిచిన అర్చకులు సుప్రభాతంతో స్వామివారిని మేల్కొలిపారు. అనంతరం తిరువారాధన జరిపి, ఉదయం ఆరగింపు చేపట్టారు. స్వయంభూ ప్రధానాలయంలో స్వామి, అమ్మవార్లకు నిజాభిషేకం జరిపారు. నిజరూప దర్శనంలో స్వయంభూ నారసింహస్వామి భక్తులకు దర్శనమిచ్చారు. స్వామివారికి తులసీ సహస్రనామార్చన, అమ్మవారికి కుంకుమార్చన, ఆంజనేయస్వామికి సహస్రనామార్చన చేపట్టి భక్తులకు స్వామి, అమ్మవార్ల దర్శన భాగ్యం కల్పించారు. ప్రధానాలయం వెలుపలి ప్రాకార మండపంలో సుదర్శన ఆళ్వారులను కొలుస్తూ అర్చకులు హోమం జరిపారు. స్వామి, అమ్మవార్ల కల్యాణోత్సవ సేవ అత్యంత వైభవంగా సాగింది. ఉత్సవమూర్తులను దివ్య మనోహరంగా అలంకరించి గజ వాహనంపై వేంచేపు చేసి కల్యాణోత్సవ సేవను జరిపారు. ప్రధానాలయ ముఖ మండపంలో వారికి ఉదయం నుంచి సాయంత్రం వరకు పలు దఫాలుగా భక్తులతో సువర్ణ పుష్పార్చన జరిపించారు. బంగారు పుష్పాలతో దేవేరులకు అర్చన చేశారు. సాయంత్రం స్వామివారికి తిరువీధి సేవ, దర్బార్ సేవ అత్యంత వైభవంగా చేపట్టారు. పాతగుట్టలో స్వామివారికి నిత్యారాధనలు వైభవంగా సాగాయి. ఉదయం నుంచి సాయంత్రం వరకు దర్శనాలు కొనసాగాయి. సుమారు 27వేల మంది భక్తులు స్వామివారిని దర్శించుకున్నట్లు ఆలయ అధికారులు వెల్లడించారు. అన్ని విభాగాలను కలుపుకొని స్వామివారి ఖజానాకు రూ. 40,05,735ఆదాయం సమకూరిందని ఆలయ అనువంశిక ధర్మకర్త బి.నరసింహమూర్తి, ఈఓ భాస్కర్‌రావు తెలిపారు. స్వామివారిని ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న దర్శించుకుని పూజలు చేశారు.

18న హుండీ లెక్కింపు

యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామివారి హుండీలను ఈ నెల 18న లెక్కించనున్నట్లు ఆలయ ఈఓ భాస్కర్‌రావు తెలిపారు. ఉదయం 7గంటలకు కొండ కింద వ్రత మండపంలోని హాల్ 2లో లెక్కింపు చేపట్టనున్నట్లు చెప్పారు.

గణనాథులకు ఘనమైన పూజలు

- చివరి రోజు అంతటా అన్నదానాలు

భువనగిరి అర్బన్ : గణనాథుడి పూజల్లో మాజీ ఎమ్మెల్యే భిక్షమయ్యగౌడ్, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు వెంకటేశ్వర్‌రెడ్డి

మోత్కూరు, సెప్టెంబర్ 15 : గణేశ్ నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా మున్సిపాలిటీ, మండలంలోని పలు గ్రామాల్లో ప్రతిష్ఠించిన వినాయక విగ్రహాలకు ఆదివారం ఘనమైన పూజలు నిర్వహించారు. మున్సిపాలిటీలోని ప్రధాన రోడ్డులో, అంబేద్కర్ నగర్‌లో, జామచెట్లబావిలో, రామలింగేశ్వరస్వామి ఆలయం సమీపంలో ఏర్పాటు చేసిన వినాయక మండపాల్లో ఉత్సవ కమిటీల ప్రతినిధులు పూజలు చేశారు. జామచెట్లబావిలో వినాయకుడికి నిర్వహించిన పూజల్లో మున్సిపల్ చైర్‌పర్సన్ గుర్రం కవితాలక్ష్మీనర్సింహారెడ్డి పాల్గొన్నారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. మున్సిపల్ వైస్ చైర్మన్ బొల్లేపల్లి వెంకటయ్య, కమిషనర్ శ్రీకాంత్, కౌన్సిలర్లు విజయ, ఉత్సవ కమిటీ ప్రతినిధులు పాల్గొన్నారు.

ఆత్మకూరు(ఎం) : మండల కేంద్రంతో పాటు అన్ని గ్రామాల్లో ఏర్పాటు చేసిన వినాయకులకు భక్తులు చివరి రోజు పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా దాతలు అన్నదాన కార్యక్రమాలు చేపట్టారు.

బొమ్మలరామారం : మండల కేంద్రంలో హనుమాన్ యూత్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వినాయక మండపం వద్ద అన్నదానం చేశారు. కార్యక్రమంలో యూత్ సభ్యులు రవి, ప్రసాద్, అనిల్, నర్సింహ పాల్గొన్నారు.

భూదాన్ పోచంపల్లి : పట్టణంలో భక్తాంజనేయస్వామి దేవస్థానంలో అభినవ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వినాయక మండపం వద్ద దాతలు రుద్ర బాలరాజు - బాలమణి, విడెం విష్ణు-విజయలక్ష్మి, భోగ కిరణ్‌కుమార్ - నవిత, జోగు లక్ష్మీనారాయణ - వర్షిత అన్నదానం చేశారు. అనంతరం వారిని యూత్ సభ్యులు సత్కరించారు. కార్యక్రమంలో బీసీ సంఘం జాతీయ ఉపాధ్యక్షుడు గుజ్జ సత్యం, దేవాలయ అధ్యక్షుడు కడవేరు వెంకటేశ్, అభినవ యూత్ అధ్యక్షుడు రవీందర్, కార్యదర్శి నరేశ్ పాల్గొన్నారు.

చౌటుప్పల్ : పట్టణంలోని చౌటుప్పల్ కాంప్లెక్స్‌లో ఏర్పాటు చేసిన వినాయక మండపం వద్ద ఆదివారం గణపతి మహా యజ్ఞ హోమం నిర్వహించారు. అనంతరం అన్నదానం చేశారు.

రామన్నపేట : మండల కేంద్రంలో ఆర్యవైశ్య సంఘం మండల కమిటీ ఆధ్వర్యంలో మహా గణపతి హోమం నిర్వహించారు. ఆర్యవైశ్య నాయకులు, మహిళలు పెద్ద సంఖ్యలో హోమంలో పాల్గొన్నారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు.

భువనగిరి అర్బన్ : పట్టణంలోని హనుమాన్‌వాడలో హనుమాన్ యూత్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గణనాథుడికి మాజీ ఎమ్మెల్యే బూడిద భిక్షమయ్యగౌడ్, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు చింతల వెంకటేశ్వర్‌రెడ్డి ఆదివారం పూజలు చేశారు. ఈ సందర్భంగా వారిని యూత్ సభ్యులు సన్మానించారు.

ఆలేరు టౌన్ : పట్టణంలోని సంతోషిమాత కాలనీ, చింతలబస్తీ వినాయక మండపాల వద్ద మున్సిపల్ చైర్మన్ వస్పరి శంకరయ్య గణనాథులను దర్శించుకొని పూజలు చేశారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. పూజల్లో బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు మల్లేశ్ గౌడ్, నాయకులు పాల్గొన్నారు.



ఆలేరు టౌన్ : పూజలు చేస్తున్న మున్సిపల్ చైర్మన్ శంకరయ్య

మోత్కూరు : అన్నదానం చేస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ కవిత

చౌటుప్పల్ కాంప్లెక్స్ గణనాథుడి వద్ద యజ్ఞం చేస్తున్న భక్తులు

రామన్నపేటలో గణపతి పూజ నిర్వహిస్తున్న ఆర్యవైశ్య నాయకులు

భూదాన్ పోచంపల్లిలో అన్నదానం కార్యక్రమంలో పాల్గొన్న భక్తులు



ఆత్మకూరు(ఎం) : రాంనగర్ కాలనీలో పూజల్లో మహిళా భక్తులు

గుర్తు తెలియని వ్యక్తి మృతి

చౌటుప్పల్ రూరల్, సెప్టెంబర్ 15 : మండలంలోని తూఫ్రాన్‌పేట గ్రామ పరిధిలో గుర్తు తెలియని వ్యక్తి మృతిచెందాడు. పోలీసుల వివరాల ప్రకారం.. తూఫ్రాన్‌పేట గ్రామ పరిధిలో జాతీయ రహదారి వెంట ఉన్న పాతబడిన ఇంట్లో గుర్తు తెలియని వ్యక్తి మృతదేహాన్ని ఆదివారం గుర్తించారు. మృతదేహాన్ని చౌటుప్పల్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పోలీస్ ఇన్‌స్పెక్టర్ మన్మథకుమార్ తెలిపారు. మృతుడు 5.8 అడుగుల ఎత్తు ఉండి యాచకుని వలే ఉన్నాడని, ఎవరైనా గుర్తిస్తే చౌటుప్పల్ పోలీస్‌స్టేషన్‌లో సంప్రదించాలని సూచించారు.

కిరాణా షాపుల్లో ఎస్ఓటీ పోలీసుల తనిఖీ

భువనగిరి అర్బన్, సెప్టెంబర్ 15 : పట్టణంలోని కిరాణా షాపుల్లో ఎస్ఓటీ పోలీసులు ఆదివారం తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా పట్టణంలోని గంజ్ ఏరియాలో ఉన్న వీరాంజనేయ దుకాణంలో పరిమితికి మించి అక్రమంగా నిల్వ ఉంచిన 360 కిలోల గోధుమ పిండిని సీజ్ చేశారు. షాపు యాజమాని సంతోష్‌పై కేసు నమోదు చేసినట్లు పట్టణ ఎస్ఐ కుమారస్వామి తెలిపారు.

విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో వినాయక మండపం దగ్ధం

మంటల్లో వినాయక మండపం

భువనగిరి కలెక్టరేట్, సెప్టెంబర్ 15 : పట్టణంలోని రాయగిరిలో శనివారం అర్ధరాత్రి విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో వినాయక మండపం దగ్ధమైంది. గ్రామంలో యాదవ సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వినాయక మండపం వద్ద శనివారం అర్ధరాత్రి దాటిన తరువాత విద్యుత్ షార్ట్ సర్క్యూట్ అయ్యింది. దీంతో మండపానికి మంటలు అంటుకున్నాయి. చుట్టుపక్కల వాళ్లు గమనించి మంటలను ఆర్పివేశారు. షార్ట్ సర్క్యూట్ జరిగిన సమయంలో నిర్వాహకులు ఎవరూ లేకపోవడంతో పెను ప్రమాదం తప్పిందని స్థానికులు పేర్కొంటున్నారు.

ఆర్థిక సాయం

ఆత్మకూరు(ఎం), సెప్టెంబర్ 15 : మండల కేంద్రానికి చెందిన బీఆర్ఎస్ యూత్ నాయకుడు పాశం చంద్రశేఖర్‌రెడ్డి తండ్రి నరసింహారెడ్డి అనారోగ్యంతో ఆదివారం మృతిచెందాడు. కేహెచ్ఆర్ ఫౌండేషన్ చైర్మన్, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు కొప్పుల హరిదీప్‌రెడ్డి అందజేసిన 5వేల రూపాయలను స్థానిక నాయకులు మృతుని కుటుంబానికి అందజేసి సానుభూతి తెలిపారు. ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య అందజేసిన రూ.5వేలను మాజీ సర్పంచ్ జె.నగేశ్ అందజేశారు. మాజీ ఎంపీటీసీ కవిత, బీఆర్ఎస్ నాయకులు ఇంద్రారెడ్డి, భిక్షపతి, అజీమొద్దీన్, రాజు, శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.

కరాటేలో అక్సజ్‌గౌడ్‌కు బంగారు పతకం

రాజాపేట, సెప్టెంబర్ 15 : మండలంలోని చల్లూరు గ్రామానికి చెందిన మాటూరి శ్రీను, వర్షిత దంపతుల కుమారుడు అక్సజ్‌గౌడ్ ఈ నెల 14న బెంగళూరులో జరిగిన నేషన్ ఓపెన్ చాంపియన్ కరాటే గేమ్స్‌లో బంగారు పతకం సాధించాడు. విద్యార్థి కొర్రెముల జేఆర్ఎస్ ఇంటర్నేషనల్ పాఠశాలలో 6వ తరగతి చదువుతున్నాడు. బంగారు పతకం సాధించిన అక్సజ్‌కు గ్రామస్తులు అభినందనలు తెలిపారు.

బ్రిడ్జి నిర్మించాలని ప్రభుత్వ విప్ ఐలయ్యకు వినతి

ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్యకు వినతిపత్రం ఇస్తున్న కొలనుపాక గ్రామస్తులు

ఆలేరు రూరల్, సెప్టెంబర్ 15 : మండలంలోని కొలనుపాక, పటేల్‌గూడెం మార్గంలో ముత్యాలమ్మ గుడి దగ్గర వాగుపై బ్రిడ్జి నిర్మించాలని కొలనుపాక గ్రామస్తులు ఆదివారం యాదగిరిగుట్టలో ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్యకు వినతి పత్రం అందజేశారు. ఇందుకు స్పందించిన విప్ బ్రిడ్జి నిర్మాణం చేపిస్తామని హామీ ఇచ్చారని గ్రామస్తులు తెలిపారు. రమేశ్, రఘుపతిరెడ్డి, సోమిరెడ్డి, ఐలయ్య, నర్సింహారెడ్డి, సోమిరెడ్డి ఉన్నారు.

ప్రశాంతంగా చేనేత కార్మిక సంఘం ఎన్నికలు

భూదాన్ పోచంపల్లిలో ఓటు వేస్తున్న చేనేత కార్మికుడు

భూదాన్ పోచంపల్లి, సెప్టెంబర్ 15 : పట్టణంలోని కృష్ణవేణి పాఠశాలలో పద్మశాలి చేనేత కార్మిక సంఘం ఎన్నికలు ఆదివారం ప్రశాంతంగా జరిగాయి. ఉదయం 8నుంచి సాయంత్రం 4గంటల వరకు పోలింగ్ జరుగగా.. ఓటు వేసేందుకు కార్మికులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. మొత్తం 2,555 ఓట్లకు గాను 2,060 మంది ఓటు హక్కు వినియోగించుకున్నారు. ఎస్ఐ భాస్కర్‌రెడ్డి ఆధ్వర్యంలో బందోబస్తు నిర్వహించారు. పద్మశాలి మహాజన సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన పోలింగ్‌కు సంఘం అధ్యక్షుడు సీత శ్రీరాములు, ఉపాధ్యక్షులు అంకం మురళి, బోగ నరసింహ, ప్రధాన కార్యదర్శి భారత బాలరత్నం ఎన్నికల అధికారులుగా వ్యవహరించారు. నాయకులు ఏలె భిక్షపతి, కర్నాటి అంజమ్మ, గంజి అంజయ్య, చింత కింది రమేశ్ ఎన్నికలను పర్యవేక్షించారు.

సీతారాం ఏచూరి ఆదర్శవాది

- సీపీఎం జిల్లా కార్యదర్శి జహంగీర్

సీతారాం ఏచూరి చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న నాయకులు

చౌటుప్పల్ రూరల్, సెప్టెంబర్ 15 : సీపీఎం జాతీయ నేత సీతారాం ఏచూరి గొప్ప ఆదర్శవాది అని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి ఎండీ జహంగీర్ అన్నారు. పట్టణంలోని సీపీఎం కార్యాలయంలో ఆదివారం ఏర్పాటు చేసిన ఏచూరి సంతాప సభలో ఆయన మాట్లాడారు. ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయంగా తన జీవితాన్ని మార్క్సిస్టు పార్టీకి అంకితం చేసిన గొప్ప వ్యక్తి అని కొనియాడారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు ఎండీ పాషా, బండారు నర్సింహ, కాంగ్రెస్ నాయకుడు మొదుగాల రమేశ్, బీఆర్ఎస్ నాయకుడు ఢిల్లీ మాధవ రెడ్డి, నాయకులు ఆల్మాస్‌పేట కృష్ణ, బత్తుల లక్ష్మయ్య, చీరిక సంజీవరెడ్డి, పల్లె మధు, బొజ్జ బాలయ్య, అలివేలు పాల్గొన్నారు.

దోపిడీ వ్యవస్థకు వ్యతిరేకంగా కళారూపాలు రూపొందించాలి

- అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు వేణు



సమావేశంలో మాట్లాడుతున్న అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు వేణు

ఆలేరు టౌన్, సెప్టెంబర్ 15 : కళాకారులు దోపిడీ వ్యవస్థకు, అశ్లీల చిత్రాలకు, సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా కళారూపాలు రూపొందించాలని అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు వేణు అన్నారు. పట్టణంలోని సీపీఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ పార్టీ కార్యాలయంలో ఆదివారం జరిగిన సమాఖ్య జనరల్ బాడీ సమావేశంలో ఆయన మాట్లాడారు. అనంతరం సంఘం జిల్లా కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా శికిలం కుమారస్వామి, ప్రధాన కార్యదర్శిగా దారా భాస్కర్, ఉపాధ్యక్షుడిగా ఇక్కిరి శ్రీనివాస్, సహాయ కార్యదర్శిగా ఇక్కిరి సహదేవ్, కోశాధికారిగా ఎలగందుల సిద్ధులు, కమిటీ సభ్యులుగా మారు సిద్ధేశ్వర్, మోతీలాల్ ఎన్నికయ్యారు.

వైద్య శిబిరం

వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్లు

భూదాన్ పోచంపల్లి, సెప్టెంబర్ 15 : పట్టణంలోని పద్మశాలి సభా వేదిక వద్ద నీలిమ హాస్పిటల్ హైదరాబాద్ ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా సుమారు రెండు వందల మందికి వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేశారు. కార్యక్రమంలో వైద్యులు స్నేహ, మల్లిక, ఇన్‌చార్జి భరత్ పాల్గొన్నారు.

ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులు అందజేత

వలిగొండ : సీఎంఆర్ఎఫ్ చెక్కు అందజేస్తున్న నాయకులు

వలిగొండ, సెప్టెంబర్ 15 : మండలంలోని నాతాళ్లగూడెం గ్రామానికి చెందిన కౌడె రాగిణి వైద్య సహాయం కోసం ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి రూ.20వేలు మంజూరయ్యాయి. చెక్కును ఆదివారం స్థానిక కాంగ్రెస్ నాయకులు బాధితురాలికి అందజేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ ఉలిపె మల్లేశం, మాజీ ఎంపీటీసీ ఉద్దగిరి భాస్కర్, నాయకులు బాలరాజు, దేవేందర్ పాల్గొన్నారు.

భువనగిరి అర్బన్ : పట్టణంలోని పహాడి నగర్‌కు చెందిన ఎండీ అంజద్‌కు సీఎం సహాయ నిధి నుంచి మంజూరైన రూ.36వేల చెక్కును 30వ వార్డు మాజీ కౌన్సిలర్ లయిఖ్ అహ్మద్ ఆదివారం అందజేశారు. ఎండీ సిరాజ్ పాల్గొన్నారు.